PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 252 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం 07.10.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated to All Districts of Telangana and Andhra Pradesh



WANTED REPORTERS

# సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు సీజే

## జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌కు కేంద్రం నోటిఫికేషన్
## తాత్కాలిక సీజేగా జస్టిస్ శ్యామ్ కోసి



హైదరాబాద్ -- ప్రభాత సూర్యుడు: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆయన త్వరలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టుకు వెళ్లడంతో తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శ్యామ్ కోసి బాధ్యతలు చేపట్టనున్నారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో పాటు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ ముగ్గురి పేర్లను సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసులకు అనుగుణంగా కేంద్రం తాజాగా నియామక ఉత్తర్వులు జారీ చేసింది.

# ఎలాన్ మస్క్ మరో రికార్డు

## ఒక ట్రిలియన్ డాలర్లు దాటిన నికర ఆస్తుల విలువ
## ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా అగ్రస్థానంలో మస్క్




అమెరికా - ప్రభాత సూర్యుడు: టెస్లా, స్పేస్‌ఎక్స్ వంటి దిగ్గజ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ సంపద మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఆయన నికర ఆస్తుల విలువ అధికారికంగా ఒక ట్రిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం మస్క్ నికర సంపద 1.022 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు సమాచారం. దీంతో ట్రిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన అత్యంత సంపన్న వ్యక్తిగా మస్క్ అగ్రస్థానంలో నిలిచారు. టెస్లా షేర్ విలువ పెరగడంతో పాటు స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు ఉన్న వాటా, ఇతర వ్యాపార సంస్థల విలువ పెరగడం ఆయన సంపద భారీగా పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. మస్క్‌కు చెందిన వ్యాపార సామ్రాజ్యం విలువ పెరుగుతున్న నేపథ్యంలో ఆయన నికర సంపద కూడా వేగంగా పెరుగుతోంది. తాజా మైలురాయితో ప్రపంచ కుబేరుల జాబితాలో మస్క్ ఆధిపత్యం మరింత బలపడింది.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.1.20 కోట్ల బంగారం పట్టివేత



శంషాబాద్ - ప్రభాత సూర్యుడు: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ నగల వ్యాపారి తిరుచిరాపల్లి నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో ఈ బంగారం పట్టుబడినట్లు సమాచారం. బంగారం అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో డీఆర్ఐ అధికారులు ప్రయాణికుడి బ్యాగ్‌ను తనిఖీ చేయగా సుమారు రూ.1.20 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు గుర్తించినట్లు తెలుస్తోంది. బంగారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంగారం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, దీనికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
## నగల వ్యాపారిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు

# సింగరేణి కార్మికులకు భారీ శుభవార్త

## -రూ.1,10,250 బోనస్ ప్రకటన
## -కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యం: కిషన్‌రెడ్డి

తెలంగాణ -- ప్రభాత సూర్యుడు: సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా భారీ బోనస్ ప్రకటించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. పండగల వేళ ఈ ప్రకటనతో సింగరేణి కార్మికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సింగరేణి తెలంగాణకు కొంగు బంగారమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణికి సంబంధించిన రూ.60 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

# తెలంగాణలో నకిలీ ఓటర్ దరఖాస్తులపై ఎన్నికల సంఘం సీరియస్

## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తప్పుడు వివరాలపై చర్యలకు ఆదేశాలు
## పెద్ద సంఖ్యలో నకిలీ ఫారం-7 దరఖాస్తులు గుర్తింపు



హైదరాబాద్ -- ప్రభాత సూర్యుడు: తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సందర్భంగా దాఖలైన నకిలీ, తప్పుడు ఓటర్ దరఖాస్తుల వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. పెద్ద సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు తప్పుడు వివరాలతో దాఖలైనట్లు గుర్తించిన ఎన్నికల సంఘం.. వాటిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. తప్పుడు వివరాలతో దరఖాస్తులు సమర్పించిన వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 31వ సెక్షన్ కింద చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఓటర్ల నమోదు అధికారులు, అలాగే రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకు కూడా ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రతులను పంపినట్లు సమాచారం. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు తప్పుడు దరఖాస్తులను అరికట్టడంపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# లండన్-చికాగో విమానంలో ఎమర్జెన్సీ

## 37 వేల అడుగుల నుంచి 9 వేల అడుగులకు తగ్గిన విమానం
## అత్యవసర సంకేతం ప్రకటించి లండన్‌కు తిరుగు ప్రయాణం



లండన్ - ప్రభాత సూర్యుడు: లండన్ నుంచి అమెరికాలోని చికాగోకు బయలుదేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో అత్యవసర పరిస్థితి తలెత్తింది. బీఏ295 విమానం ఐర్లాండ్ గగనతలంలో ప్రయాణిస్తుండగా 37 వేల అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా 9 వేల అడుగుల ఎత్తుకు దిగింది. దీంతో ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పరిస్థితిని గుర్తించిన పైలట్లు అత్యవసర సంకేతం 7700ను ప్రకటించి విమానాన్ని తిరిగి లండన్ వైపు మళ్లించినట్లు సమాచారం. విమానంలో అత్యవసర పరిస్థితి తలెత్తడానికి అసలు కారణం ఏమిటన్నది ప్రస్తుతం స్పష్టంగా తెలియరాలేదు. విమానం సురక్షితంగా లండన్‌కు చేరుకున్న అనంతరం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# ఏసీబీ వలలో రంగారెడ్డి డీఎంహెచ్ఓ

## లైసెన్స్ కోసం రూ.2 లక్షలు డిమాండ్

## రూ.లక్ష లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ స్వర్ణకుమారి



రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు: రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో లంచాల వ్యవహారం బట్టబయలైంది. రూ.లక్ష లంచం తీసుకుంటూ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (డీఎంహెచ్ఓ) స్వర్ణకుమారి ఏసీబీ అధికారుల వలలో రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఒక ఫిజియోథెరపీ కేంద్రాన్ని గతంలో అధికారులు సీజ్ తాళాలు స్వాదీనం చేసుకున్నారు. తిరిగి ఫిజియోథెరపీ కేంద్రం తాళాలు తిరిగి ఇవ్వడంతోపాటు, తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు,హా కొత్త లైసెన్స్ జారీ చేసేందుకు డీఎంహెచ్ఓ రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. ఏసిబి అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన లంచం తీసుకుంటున్న సమయంలో డీఎంహెచ్ఓను పట్టుకున్నారు. మొదటి విడతగా బాధితుడు ఇచ్చిన రూ.లక్షను డీఎంహెచ్ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు ఇవ్వగా, ఆయన ఆ మొత్తాన్ని డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి కార్ డ్రైవర్ మద్దూరి క్రిష్ణయ్యకు ఇచ్చే క్రమంలో ఆ డబ్బులను తీసుకుని కారులో పెట్టేందుకు వెళుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డ్రైవర్ కృష్ణయ్య తదితరులపై ఏసీబీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# రూ.4 లక్షల లంచం.. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అరెస్ట్

## భవన నిర్మాణ అనుమతుల కోసం రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణ

## రూ.6.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న ఏసీబీ



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గోల్కొండ జోన్, సర్కిల్–33, మెహదీపట్నంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసీరాం సునీత ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ.4 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు. భవన నిర్మాణానికి అనుమతులు కల్పించేందుకు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను పట్టించుకోకుండా రూ.8 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. ఫిర్యాదు అందడంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.4 లక్షలు స్వీకరిస్తుండగా సునీతను అధికారులు పట్టుకున్నారు. ఆమె వద్ద లెక్కల్లో చూపని మరో రూ.2.5 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం రూ.6.5 లక్షల నగదు ఏసీబీ అధికారులకు లభించింది. అనంతరం సునీతను నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల కోసం ఏర్పాటు చేసిన మొదటి అదనపు ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన అనారోగ్యం ఎదురైతే చికిత్స ఖర్చులు పెద్ద భారంగా మారడం సహజం. ముఖ్యంగా గుండె, కిడ్నీ, క్యాన్సర్, ప్రమాదాలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు లక్షల రూపాయలు అవసరమయ్యే పరిస్థితుల్లో ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాలు ఎంతో కీలకంగా మారుతున్నాయి. తెలంగాణలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ పథకం ఇలాంటి కుటుంబాలకు ఒక ముఖ్యమైన ఆర్థిక అండగా నిలుస్తోంది. అయితే పథకం ఉద్దేశం ఎంత మంచిదైనా, దాని అమలులో ఎదురయ్యే సమస్యలను నిరంతరం పరిష్కరిస్తేనే ప్రజలకు పూర్తి ప్రయోజనం అందుతుంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో చికిత్సకు సంబంధించిన సమాచారం, అనుమతులు, ఆస్పత్రుల ఎంపిక, అవసరమైన వైద్య సేవల లభ్యత వంటి అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోతే, దాని ప్రభావం రోగులపై పడే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఆస్పత్రుల మధ్య ఆర్థిక వ్యవహారాల సమస్యలు ఏవైనా ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించాలి. పేద రోగి ఆస్పత్రి గేటు వద్దకు వెళ్లిన తర్వాత పథకం వర్తిస్తుందా లేదా అనే అనిశ్చితి ఉండకూడదు. ఏ చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది, ఎక్కడ అందుబాటులో ఉంది, ఎలాంటి పత్రాలు అవసరం వంటి వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అందుబాటులో ఉంచాలి. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే ఆస్పత్రులపై కూడా నిరంతర పర్యవేక్షణ అవసరం. రోగులకు అవసరమైన వైద్యం అందించకుండా అనవసర పరీక్షలు చేయడం, అదనపు ఖర్చులు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు వస్తే వాటిపై వేగంగా విచారణ జరపాలి. అదే సమయంలో నిజాయితీగా సేవలు అందిస్తున్న ఆస్పత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రోగి హక్కులు, ఆస్పత్రుల ఆర్థిక సాధ్యత రెండింటినీ సమతుల్యం చేయడం అవసరం. ప్రభుత్వ ఆస్పత్రులను కూడా మరింత బలోపేతం చేయడం ఆరోగ్యశ్రీ విజయానికి కీలకం. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మందులు, అత్యవసర

# మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం

## గర్భిణీలు, రోగులకు పండ్ల పంపిణీ



హయత్‌నగర్ – ప్రభాత సూర్యుడు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా హయత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణీలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పేదలు, అవసరమైన వారికి సహాయం అందించడమే లక్ష్యంగా ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతామని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, గర్భిణీలు, రోగులు, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో దేశ ప్రజలకు మరెన్నో సంవత్సరాలు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహ, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు జంగా రెడ్డి, అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్, అభిలాష్, హ్రీరితిక్ తదితరులు పాల్గొన్నారు.



# రుణాలు సకాలంలో చెల్లిస్తేనే సంఘం బలోపేతం!

## రైతుల సహకారంతో అభివృద్ధి బాటలో బాటసింగారం సహకార సంఘం

## 59వ సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి



అబ్దుల్లాపూర్ మెట్, ప్రభాత సూర్యుడు: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 59వ సర్వసభ్య సమావేశం బుధవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని సంఘం ప్రాంగణంలో ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సంఘం అభివృద్ధి పథంలో కొనసాగుతోందన్నారు. సంఘం మరింత బలోపేతం కావాలంటే రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రైతుల సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో సంఘానికి సంబంధించిన జమలు, ఆదాయం, ఖర్చులు తదితర ఆర్థిక లావాదేవీల వివరాలను సభ్యులకు వెల్లడించారు. అనంతరం రైతులు, సభ్యులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. రైతుల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని సంఘం అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆదర్శ రైలులను సన్మానించారు. ఈ సమావేశంలో రైతులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంఘం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి



పెద్ద అంబర్ పేట్ – ప్రభాత సూర్యుడు: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నాగోల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్. సంపత్‌కుమార్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి అందించిన సేవలను, ఆయన చూపిన సత్యం, అహింసా మార్గాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

# అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించాలి



మొదటి పేజీ తరువాయి

విద్య, నైపుణ్యాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా తెలంగాణను అభివృద్ధి చేసి దేశ ప్రగతిలో కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. యువతకు విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, నర్సరీ విద్య వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యా రంగంలో సంస్కరణలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాంతీయ భాషతో పాటు ఇంగ్లీష్‌పై కూడా విద్యార్థులకు పట్టు సాధించేలా విద్యా విధానం ఉండాలని అన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.

## సీజ్ చేసిన బ్యాంకు ఖాతాల నుంచి లావాదేవీలకు అనుమతి

## రూ.3 కోట్ల నగదు అన్‌ఫ్రీజ్‌కు నిరాకరణ

అనుమతించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. వాదనలు పరిశీలించిన న్యాయస్థానం ఖాతాల వినియోగానికి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఖాతాల్లో నిల్వ ఉన్న సుమారు రూ.3 కోట్ల నగదుపై మాత్రం కోర్టు అన్‌ఫ్రీజ్ ఆదేశాలు ఇవ్వలేదు. ఆ మొత్తాన్ని ప్రస్తుతానికి సీజ్ చేసిన స్థితిలోనే కొనసాగించాలని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఖాతాల నిర్వహణకు అనుమతి లభించినప్పటికీ, రూ.3 కోట్ల నగదుపై ఐబొమ్మ రవికి ఊరట దక్కలేదు.




# బహుజనుల బాణాన్ని.. యువత యుద్ధ నినాదాన్ని

మొదటి పేజీ తరువాయి



అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే జూరాల నుంచి నీటిని తీసుకెళ్లి ఇబ్రహీంపట్నం వరకు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని, అది సాధించలేకపోతే తన పేరు మార్చుకుంటానని సవాల్ చేశారు. రైతుల సమస్యలను కూడా కవిత ప్రస్తావించారు. యూరియా, సాగునీరు, విద్యుత్, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో గద్వాల ప్రాంతంలో పంటకు మద్దతు ధర లభించక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనను ప్రస్తావిస్తూ, రైతులు మళ్లీ అలాంటి పరిస్థితుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో సామాజిక అన్యాయం కొనసాగుతోందని కవిత ఆరోపించారు. ముదిరాజ్, ముస్లిం, నేతన్న, గీతన్న వర్గాలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ఎస్సీ వర్గాల్లోని వివిధ సమూహాలతో పాటు లంబాడీలు, ముస్లింలకు కూడా తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లగచర్ల ఘటన, మక్తల్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలపై కూడా ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తనపై వస్తున్న రాజకీయ విమర్శలకు కవిత స్పందిస్తూ.. తాను కాంగ్రెస్ వదిలిన బాణం కాదని, బీఆర్ఎస్ వదిలిన బాణం కాదని, బీజేపీ బాణం కూడా కాదని అన్నారు. తాను బహుజనుల బాణాన్ని, యువత యుద్ధ నినాదాన్ని అని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాలతో ముందుకు సాగుతున్న వీరవనితగా తనను తాను అభివర్ణించుకున్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే ప్రధాని మోదీ, కేసీఆర్, రేవంత్‌రెడ్డితో రాజకీయంగా పోరాడతానని కవిత అన్నారు. ఎవరి మద్దతు లేకుండానే ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని చెప్పారు. తెలంగాణలో మహిళా నాయకత్వానికి మరిన్ని అవకాశాలు రావాలని, మాతృస్వామ్య భావనతో ప్రజా పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. కొడంగల్ పరిధిలోని కొన్ని మండలాల్లో అక్షరాస్యత రేటు తక్కువగా ఉందని పేర్కొంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ముఖ్యమంత్రికి మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉందని, ఇప్పటికైనా ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలు ఇచ్చినా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని కవిత విమర్శించారు. ఇసుక, మట్టి, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆమె ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులు, ఉద్యోగులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని అన్నారు. బహుజన రాజ్యం కోసం ప్రజలు తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పిస్తామని కవిత పిలుపునిచ్చారు.

# సంపాదకీయం

## ఆరోగ్యశ్రీకి మరింత భరోసా అవసరం



పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన అనారోగ్యం ఎదురైతే చికిత్స ఖర్చులు పెద్ద భారంగా మారడం సహజం. ముఖ్యంగా గుండె, కిడ్నీ, క్యాన్సర్, ప్రమాదాలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు లక్షల రూపాయలు అవసరమయ్యే పరిస్థితుల్లో ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాలు ఎంతో కీలకంగా మారుతున్నాయి. తెలంగాణలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ పథకం ఇలాంటి కుటుంబాలకు ఒక ముఖ్యమైన ఆర్థిక అండగా నిలుస్తోంది. అయితే పథకం ఉద్దేశం ఎంత మంచిదైనా, దాని అమలులో ఎదురయ్యే సమస్యలను నిరంతరం పరిష్కరిస్తేనే ప్రజలకు పూర్తి ప్రయోజనం అందుతుంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో చికిత్సకు సంబంధించిన సమాచారం, అనుమతులు, ఆస్పత్రుల ఎంపిక, అవసరమైన వైద్య సేవల లభ్యత వంటి అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోతే, దాని ప్రభావం రోగులపై పడే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఆస్పత్రుల మధ్య ఆర్థిక వ్యవహారాల సమస్యలు ఏవైనా ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించాలి. పేద రోగి ఆస్పత్రి గేటు వద్దకు వెళ్లిన తర్వాత పథకం వర్తిస్తుందా లేదా అనే అనిశ్చితి ఉండకూడదు. ఏ చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది, ఎక్కడ అందుబాటులో ఉంది, ఎలాంటి పత్రాలు అవసరం వంటి వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అందుబాటులో ఉంచాలి. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే ఆస్పత్రులపై కూడా నిరంతర పర్యవేక్షణ అవసరం. రోగులకు అవసరమైన వైద్యం అందించకుండా అనవసర పరీక్షలు చేయడం, అదనపు ఖర్చులు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు వస్తే వాటిపై వేగంగా విచారణ జరపాలి. అదే సమయంలో నిజాయితీగా సేవలు అందిస్తున్న ఆస్పత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రోగి హక్కులు, ఆస్పత్రుల ఆర్థిక సాధ్యత రెండింటినీ సమతుల్యం చేయడం అవసరం. ప్రభుత్వ ఆస్పత్రులను కూడా మరింత బలోపేతం చేయడం ఆరోగ్యశ్రీ విజయానికి కీలకం. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మందులు, అత్యవసర సేవలు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటే పేదలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతుంది. ఆరోగ్యశ్రీ కేవలం చికిత్స ఖర్చును భరించే పథకంగా కాకుండా, పేద కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య భరోసాగా మారాలి. ఆరోగ్యం విషయంలో ఆలస్యం అంటే ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం. అందుకే ఆరోగ్యశ్రీ సేవల్లో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెంచాల్సిన అవసరం ఉంది. అర్హులైన ప్రతి కుటుంబానికి ఎలాంటి ఆటంకం లేకుండా వైద్యం అందేలా వ్యవస్థను నిరంతరం సమీక్షించాలి. పథకం పరిధిని, సేవల నాణ్యతను, ఆస్పత్రుల నెట్‌వర్క్‌ను అవసరానికి అనుగుణంగా మెరుగుపరుస్తూ ముందుకు సాగాలి. పేదవాడికి అనారోగ్యం వచ్చినప్పుడు అప్పుల కోసం తలుపులు తట్టాల్సిన పరిస్థితి రాకుండా చేయడమే ఆరోగ్యశ్రీ అసలు లక్ష్యం. ఆ లక్ష్యం ఆచరణలోనూ నెరవేరినప్పుడే ఈ పథకం నిజమైన ప్రజారోగ్య భరోసాగా నిలుస్తుంది.

## గ్రామ పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులపై కీలక ఆదేశాలు

### సర్పంచ్‌--ఉప సర్పంచ్ మధ్య బిల్లుల పంచాయితీకి చెక్

### ఏడు రోజులు దాటితే చర్యలు..

### ప్రత్యామ్నాయంగా జాయింట్ చెక్ పవర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపుల సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తుతున్న విభేదాలకు చెక్ పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీ చెక్కులపై సంతకాలు చేయడంలో ఉప సర్పంచ్‌లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి కారణం లేకుండా ఏడు రోజులకు మించి చెక్కులపై సంతకం చేయకుండా జాప్యం చేస్తే సంబంధిత కలెక్టర్ విచారణ చేపట్టాలని సూచించారు. జాప్యం ఉద్దేశపూర్వకంగానే జరిగిందని విచారణలో తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే సమయంలో సంతకాల ప్రక్రియలో జాప్యం కొనసాగితే ఉప సర్పంచ్ స్థానంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో, ఎంపీడీవోల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ కల్పించేలా చర్యలు తీసుకునే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## స్వచ్ఛత ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం

### పరిశుభ్రత నిరంతర బాధ్యత: పీఐబీ ఏడీజీ శ్రుతి పాటిల్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: స్వచ్ఛ భారత్ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్న ఉద్యమమని పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ అన్నారు. పరిశుభ్రతను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రతిరోజూ కొనసాగించాల్సిన బాధ్యతగా భావించాలని సూచించారు. 'స్వచ్ఛతా మే సహభాగ్--స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్' ఇతివృత్తంతో నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హీ సేవా--2026'లో భాగంగా గురువారం కవాడిగూడలోని సీజీఓ టవర్స్ ప్రాంగణంలో 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. పీఐబీ, సీబీసీ హైదరాబాద్ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రుతి పాటిల్ మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీజీఓ టవర్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకంగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను ఆమె అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా గ్లౌవ్స్, పారిశుధ్య సామగ్రిని అందజేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా సీజీఓ టవర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్పెషల్ టెట్-2 నోటిఫికేషన్ విడుదల

### ఈ నెల 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

### నవంబర్ 16 నుంచి పరీక్షలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్-2 నోటిఫికేషన్ విడుదలైంది. అర్హత కలిగిన ఇన్‌సర్వీస్ టీచర్లు ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబర్ 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు స్పెషల్ టెట్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం స్పెషల్ టెట్-1 పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా టెట్-2కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడంతో అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితుడికి 51 ఏళ్ల జైలు శిక్ష

### తిప్పర్తిలో బాలికను అపహరించి నిర్బంధించి అత్యాచారం

### రెండు కేసుల్లో శిక్షలు ఏకకాలంలో అమలు



నల్గొండ - ప్రభాత సూర్యుడు: తిప్పర్తి మండలంలో మైనర్ బాలికను మాయమాటలతో మభ్యపెట్టి పలుమార్లు అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. తొలి కేసులో 51 ఏళ్ల జైలు శిక్ష, మరో కేసులో జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. రెండు శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు గతంలో ఇదే బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో 2021లో పోక్సో చట్టం కింద శిక్ష అనుభవించాడు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత బాలికపై కక్ష పెంచుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆమెను అపహరించి కొన్ని రోజులపాటు నిర్బంధించి మరోసారి అత్యాచారం చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ కీలక సాక్ష్యాధారాలను కోర్టు ముందు సమర్పించింది. ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్షలు విధించింది. బాలికపై లైంగిక నేరాలకు పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష పడటంతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగినట్లు అధికారులు తెలిపారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నికకు బ్రేక్..!

మొదటి పేజీ తరువాయి

అనర్హుడిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 24న ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. అనంతరం ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు అసెంబ్లీ సచివాలయం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉపఎన్నిక నిర్వహణకు మార్గం సుగమమైనప్పటికీ.. విజయారెడ్డి తాజాగా మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తన 2024 ఎన్నికల పిటిషన్‌పై తుది నిర్ణయం వచ్చే వరకు ఉపఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వకుండా ఈసీని ఆదేశించాలని ఆమె కోరారు. అత్యవసర విచారణకు ఆమె విజ్ఞప్తి చేసినప్పటికీ హైకోర్టు అందుకు నిరాకరించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ పిటిషన్‌కు స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం కీలక వైఖరిని వెల్లడించింది. విజయారెడ్డి ఎన్నికల పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయబోమని హైకోర్టుకు తెలిపింది. దీంతో ఇప్పటికే ఖాళీగా ప్రకటించిన ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక ఎప్పుడు జరుగుతుందనే అంశం హైకోర్టు తదుపరి నిర్ణయంపై ఆధారపడి ఉంది.

## హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ

మొదటి పేజీ తరువాయి

సరిహద్దులు ఖరారయ్యాయి. రాజేంద్రనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లోనూ మార్పులు చేశారు. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల పోలీసు పరిధులను కూడా పునర్విభజించారు. బంజారాహిల్స్, మధురానగర్ పోలీస్‌స్టేషన్లను పునర్వ్యవస్థీకరించిన జూబ్లీహిల్స్ జోన్ పరిధిలోకి తీసుకువచ్చారు. కేవలం లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లకే పరిమితం కాకుండా ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థలోనూ జోన్లు, డివిజన్ల సరిహద్దులను మార్చారు. శంషాబాద్ ట్రాఫిక్ పరిధిలోనూ కొత్త మార్పులు చేశారు. అలాగే ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని పోలీస్‌స్టేషన్లను కొత్త జోన్లకు అనుసంధానం చేశారు. వెస్ట్ జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌ను జూబ్లీహిల్స్ జోన్, ఈస్ట్ జోన్‌ను సికింద్రాబాద్ జోన్, సెంట్రల్ జోన్‌ను ఖైరతాబాద్ జోన్, సౌత్ జోన్‌ను చార్మినార్ జోన్, సౌత్-వెస్ట్ జోన్‌ను గోల్కొండ జోన్, సౌత్-ఈస్ట్ జోన్‌ను రాజేంద్రనగర్ జోన్‌కు అనుసంధానం చేశారు. జోనల్ సైబర్ సెల్ పరిధులను కూడా కొత్త పోలీసు జోన్లకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించారు. పెరుగుతున్న సైబర్ నేరాలకు వేగంగా స్పందించడం, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం, మహిళల భద్రతకు ప్రత్యేక పర్యవేక్షణ కల్పించడం, శాంతిభద్రతల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం ఈ పునర్వ్యవస్థీకరణ ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. కొత్త పోలీసు పరిధులతో అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాలపై మరింత సమర్థవంతంగా పర్యవేక్షణ చేపట్టడంతో పాటు ప్రజలకు పోలీసు సేవలు వేగంగా అందే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## తెలంగాణ-దక్షిణ కొరియా బంధానికి కొత్త బాట

### కేటీఆర్‌తో దక్షిణ కొరియా అధ్యక్షుడి సలహాదారు భేటీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: తెలంగాణ--దక్షిణ కొరియా మధ్య సాంకేతికత, పరిశ్రమలు, ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. గురువారం తెలంగాణ భవన్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడి సలహాదారు ప్రొఫెసర్ యంగ్‌టే చోతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం సియోల్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందంతోనూ కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియా అభివృద్ధి ప్రస్థానాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి ప్రపంచస్థాయి సాంకేతిక శక్తిగా కొరియా ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. కొరియా కంపెనీలకు తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రగతిశీల విధానాలు, బలమైన పారిశ్రామిక వాతావరణం ఉన్నాయని వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు కొరియా సంస్థలకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో యంగ్‌వన్ కార్పొరేషన్, హ్యుందాయ్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రపంచానికి ఉత్పత్తులు, సేవలు అందించడంతో పాటు భారీ మార్కెట్‌ను అందించే సామర్థ్యం భారత్‌కు ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ--కొరియా భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో విద్య, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించినట్లు సమాచారం. భవిష్యత్‌లో తెలంగాణ, దక్షిణ కొరియా మధ్య మరింత బలమైన సంబంధాలు ఏర్పడాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

## మహిళలకు కరచాలనం కూడా ఇవ్వడు

### ఎనిమిది నెలల క్రితమే ఉద్యోగంలో చేరిక

### ఫ్లై దుబాయ్ కో-పైలట్‌పై సంచలన విషయాలు!




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఫ్లై దుబాయ్ విమానంలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడి చేసి విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒమన్‌కు చెందిన కో-పైలట్‌పై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సహచర పైలట్ల వివరాల ప్రకారం అతడు అత్యంత మతపరమైన ప్రవర్తన కలిగిన వ్యక్తిగా ఉండేవాడని, మహిళలతో కరచాలనం చేసేందుకు కూడా నిరాకరించేవాడని తెలిసింది. ఫ్లై దుబాయ్‌లో అతడు కేవలం ఎనిమిది నెలల క్రితమే చేరినట్లు మరో పైలట్ తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఇవన్నీ సహచర పైలట్ చేసిన వ్యాఖ్యలు మాత్రమేనని, దాడికి కారణం లేదా ఉద్దేశాన్ని అవి నిర్ధారించవని అధికారులు స్పష్టం చేశారు. విమానంలో చోటుచేసుకున్న ఘటన వెనుక ఉగ్రవాద ఉద్దేశం ఉందా? దాడి ముందస్తు ప్రణాళికతో జరిగిందా? అనే కోణాల్లో యూఏఈ అధికారులు దర్యాప్తు చేపట్టారు. సెప్టెంబర్ 30న 174 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన విమానంలో కాక్‌పిట్‌లో ఘర్షణ చోటుచేసుకుంది. కో-పైలట్ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడినా ధైర్యంగా స్పందించడంతో ప్రయాణికులు దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోగలిగారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని టబుక్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. మచ్చర్ సాహసాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ప్రశంసించిన విషయం తెలిసిందే.




# మళ్లీ థియేటర్లలో 'గీతాంజలి'..!

కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిన క్లాసిక్ ప్రేమకథా చిత్రం 'గీతాంజలి' మరోసారి థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రాన్ని నవంబర్ 13న 4కే రూపంలో రీ-రిలీజ్ చేయనున్నట్లు తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ వెల్లడించింది. ఎన్నేళ్లు గడిచినా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయిన ఈ సినిమాను అత్యాధునిక చిత్ర నాణ్యతతో మరోసారి వెండితెరపై చూసే అవకాశం అభిమానులకు దక్కనుంది.

## రూ.167 కోట్ల క్లబ్‌లో

# 'ది ప్యారడైజ్'




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలైన 10 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.167 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు తాజా బాక్సాఫీస్ నివేదికలు వెల్లడించాయి. మిక్స్‌డ్ టాక్ ఉన్నప్పటికీ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన కొనసాగుతోంది.



## ఆసియా క్రీడల్లో భారత్ అదుర్స్..

# 85 పతకాలు






న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: 2026 ఆసియా క్రీడల్లో భారత్ అద్భుత ప్రదర్శనతో నాలుగో స్థానంలో నిలిచింది. భారత క్రీడాకారులు మొత్తం 85 పతకాలు సాధించారు. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. చివరి రోజుల్లో ఆర్చరీ, గోల్ఫ్, క్రికెట్, రెజ్లింగ్, హాకీలో వచ్చిన విజయాలతో భారత్ పతకాల సంఖ్యను మరింత పెంచుకుంది.

## వెస్టిండీస్‌పై భారత్‌కు షాక్

# రికార్డు ఛేజ్‌తో ఓటమి




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో భారత్‌కు ఓటమి ఎదురైంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 351 పరుగులు చేయగా, షై హోప్ అజేయ 162 పరుగులతో చెలరేగడంతో వెస్టిండీస్ 49.2 ఓవర్లలోనే 352 పరుగులు చేసి ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో భారత్ సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్నప్పటికీ, చివరి మ్యాచ్‌లో బౌలింగ్, ఫీల్డింగ్ వైఫల్యాలు ఆందోళన కలిగించాయి.

Printed by RATNA GRAPHICS, At H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Published by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS, Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana.
Editor : CHERUKU UPENDAR, E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555